

# అమ్మ నాతోనే ఉంది!!

-ఎస్. శివనాగేశ్వర రావు

"అందరికంటే ఎవరంటే నీ కిష్టం?" అని ఎవరైనా నన్నడిగితే క్షణమైనా ఆలోచించకుండా "అమ్మ" అని సమాధానం చెప్పేస్తాను. నేనెవరో తెలియని వారు నా సమాధానం విని "ఇతనికింకా పెళ్ళయి ఉండదు. పెళ్ళయితే అమ్మ అల్లం, పెళ్ళాం బెల్లం అవుతారు. ఎందర్ని చూడలేదు?" అని నవ్వుకోవచ్చు.

అటువంటి వారికి నా సమాధానం ఏమంటే నాకు పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. అయినా ఇప్పటికీ నాకు అందరికంటే అమ్మంటేనే ఎక్కువ ఇష్టం. ఈ సమాధానం విని మరికొందరు "భార్యాభర్తలకు పడదేమో! అందుకే అమ్మ వైపు మొగ్గు చూపుతున్నాడు" అని అనుమానం పడవచ్చు. అటువంటిది కూడా ఏం లేదు. నేను, నా భార్య ఈశ్వరి చాలా అన్యోన్యంగా ఉంటాం. మమ్మల్ని ఎరిగినవారు 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అని కూడా అంటుంటారు.

మరి వయసులో ఉన్న అందమైన భార్య, ముద్దులు మూటగట్టేట్లు ఉండే పాప, బాబులను వదిలి వృద్ధురాలైన తల్లంటే ఎందుకట అంతిష్టం? అంటే ఏం చెప్పను? వాన కురిసేటప్పుడు వచ్చే మట్టి వాసనకు సరిసాటి పెర్‌ఫ్యూమ్ ఏదైనా ఉంటుందా? ఇదీ అంతే!

చిన్నప్పటినుంచీ నాకు అమ్మంటే ఎంతో ఇష్టం. చలికి ముసుగు పెట్టి పడుకున్నప్పుడు అమ్మ వచ్చి "ఒరే నాన్నా! బడికి టైం అయింది లేవరా!" అని లేపగానే ఎంతటి చలి అయినా నాకేం అనిపించేది కాదు. లేచి పోయేవాడిని. నాన్న చనిపోయినప్పుడు నేను ఏడుస్తుంటే అమ్మ నన్ను హృదయానికి హత్తుకుని "ఏడవకురా కన్నా! నీ కన్నీళ్ళు నాకు మరింత దుఃఖం కలిగిస్తున్నాయి" అనగానే టక్కున ఏడుపు ఆపేసాను.

జ్వరం వచ్చి బాధపడుతున్నప్పుడు ఔషధం కంటే అమ్మచేసే సేవలు, చూపే ప్రేమ నాకు బలాన్నిచ్చేవి. డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగం రాక బాధపడుతున్నప్పుడు అమ్మ చెప్పే ధైర్య వచనాలు నాకు మనోబలాన్నిచ్చేవి.

నాన్న లేకపోయినా అమ్మ శరీర కష్టంచేసి నన్ను చదివించింది. అమ్మ తన రక్తాన్ని స్వేదంగా మార్చి నన్ను చదివిస్తున్న సంగతి నేనే క్షణమూ మరచింది లేదు. అందుకే కష్టపడి చదివాను. నా కష్టం కంటే అమ్మ పడిన కష్టానికి భగవంతుడు ఎక్కువ విలువ ఇచ్చినట్లున్నాడు. అందుకే నేను పడిన కష్టానికి మించిన మంచి ఉద్యోగం వచ్చింది. జీతం అయిదంకెలు. కారు... బంగ్లా... బంట్రోతు వంటి అన్ని హంగులూ ఉన్నాయి.

ఉద్యోగం వచ్చాక ఈశ్వరితో పెళ్ళి కుదిరింది. వాళ్ళు మంచి ఆస్తిపరులు. అమ్మకు, నాకు వాళ్ళ ఆస్తికంటే అమ్మాయి నచ్చింది. అందుకే ఒప్పుకున్నాం. మా బంధువులు కొందరు అసూయతో దాన్ని మరోలా అర్థం చేసుకున్నారు. 'ఆస్తి చూసి పడిపోయారు. తరువాత అనుభవిస్తారు' అన్నారు. ఆ మాటలు నేనంతగా పట్టించుకోలేదు.

కొందరు సన్నిహితులు మాత్రం 'మీ అమ్మతో నీ సాన్నిహిత్యం మేం ఎరిగినదే! భార్య వచ్చినా ఆ బంధం అలాగే ఉండేలా చూడు. ఆమెను బాధ పెట్టేలా మాత్రం ప్రవర్తించకు' అని సలహా ఇచ్చారు. ఆ మాటలు నా హృదయం మీద బలంగా ముద్ర పడ్డాయి. పెళ్ళయ్యాక భార్య మాటలకు గంగిరెద్దుల్లా తల ఊపే వార్ని నేనూ కొందర్ని చూసాను. నాకటువంటి స్థితి రాదనే నమ్మేవాడిని. కానీ అమ్మను నేను ప్రేమించి, నా అర్ధాంగి ద్వేషిస్తే నేనూ అమ్మను ద్వేషించినట్లే కదా! అందుకే భయపడ్డాను.

కానీ ఈ విషయంలోనూ దేవుడు నా పక్షానే నిలిచాడు. ఈశ్వరి కోడలిగా మా ఇంట్లో అడుగుపెట్టాక ఏనాడూ అమ్మ పట్ల తప్పుగా ప్రవర్తించలేదు. అత్తగారికి ఇవ్వవలసిన గౌరవం ఇస్తూనే వచ్చింది. ప్రేమ చూపుతూనే వుంది.

అమ్మను ఎంతగానో ప్రేమించే నేనే ఒక విషయంలో మాత్రం అమ్మను వ్యతిరేకించే వాడిని. అదేమంటే అమ్మదగ్గర పాత కాలంనాటి బొంత ఒకటి ఉండేది. దాన్నిండా అతుకులే! ఆ బొంతను అమ్మ ఎంతగా ఇష్టపడేదో నేనంతగా ద్వేషించే వాడిని. అప్పుడప్పుడు అమ్మదగ్గర 'ఎందుకమ్మా! ఆ అతుకుల బొంత. పారేద్దాం' అని చిరుకోపం చూపేవాడిని. అమ్మ మాత్రం నవ్వుతూ "ఉండనీరా! విశ్వం! ఈ అతుకుల బొంతతో నా అనుబంధం ఏనాటిదో!' అనేది. అమ్మ బాధ పడుతుందని ఊరుకున్నాను గాని లేకుంటే ఏనాడో ఆ అతుకుల బొంతను తగలబెట్టి ఉండేవాడిని.

పోనీ ఆ అతుకుల బొంతను అమ్మ కనిపించకుండా ఒక మూల దాచి ఉంచేది కాదు. తరుచూ దానికి మరమ్మత్తులు చేస్తూ ఉండేది. కంటి చూపు ఆనకపోయినా మనవడి చేతో, మనవరాలి చేతో సూదిలో దారం ఎక్కించుకుని ఆ అతుకుల బొంతకు చిరిగినచోట పదిలంగా కుట్టుకునేది. ఎందుకమ్మా! అనవసరపు శ్రమ అంటే ఒప్పుకునేది కాదు. 'ఏదో నా తృప్తికోసం! నీవు మాట్లాడకు' అనేది.

ఒకప్పటి మా పాత ఇంటిలో అయితే బీటలువారిన గోడలు... నులక మంచం... నాప రాళ్ళు ఉండేవి. అటువంటి వాతావరణంలో ఆ అతుకుల బొంత అంత రోతగా కనిపించేది కాదు. అక్కడ చక్కగా ఇమిడిపోయేది.

ఇప్పుడు మా కొత్త బంగ్లాలో డబుల్‌కాట్ బెడ్స్... మార్బుల్ స్టోన్స్... ఫాండ్లీతూర్స్... మధ్య ఆ అతుకుల బొంత ఇమడ లేక చాలా రోతగా... అసహ్యంగా కనిపించసాగింది. అమ్మకదేం తెలీదు. ఇంటిలో ఎవరైనా గెస్టులు ఉన్నాసరే డ్రాయింగ్ రూమ్‌లో ఆ అతుకుల బొంత వేసుకుని సుఖంగా నిద్రపోయేది.

దేవతలాంటి అమ్మ మెత్తటి పరుపుల మీద సుఖపడకుండా తనకు బానిసగా చేసుకున్న ఆ బొంత మీద నాకు చాలా కోపంగా ఉండేది.

పోనీ అమ్మ మనసు బాధపడకుండా, నాకు ఇబ్బంది లేకుండా ఆ బొంతను అందంగా మార్పుచేయడానికి బొంతలు కుట్టేవాడిని పిలిచాను. అందుకు అమ్మ అసలు ఒప్పుకోలేదు. "విశ్వం! ఈ బొంత నా ప్రాణం. దాని మీద పరాయి వాళ్ళ చేయి పడడం నాకసలు ఇష్టం ఉండదు" అని ఖరాఖండిగా చెప్పేసింది. ఎప్పుడూ మృదువుగా మాట్లాడే అమ్మ ఆ బొంత విషయంలో అలా మాట్లాడేసరికి నేను మరేం మాట్లాడలేక పోయాను.

అంతటితో ఆ బొంత మీద నా కోపం, అసహ్యం మరింత పెరిగాయి. అమ్మను ఎంతగానో ప్రేమించే నేను ఆమె నిండు నూరేళ్ళు జీవించాలని కోరుకునేవాడిని. కానీ బొంతను చూసినప్పుడు మాత్రం 'అమ్మ చనిపోతే దాన్ని తీసుకెళ్ళి దూరంగా పారేయాలి' అనుకునే వాడిని. అమ్మను అమితంగా ప్రేమించే నేను నాకు తెలీకుండానే అమ్మ చావు గురించి ఆలోచించానంటే కారణం ఆ బొంత మీద నాకున్న అసహ్యమే!

ఒక్కోసారి పిల్లలు కూడా నాన్నమ్మ సరసన ఆ బొంత మీద పడుకుని ''డాడీ! నాన్నమ్మ బొంత భలే మెత్తగా ఉంది. మేం ఇక్కడే పడుకుంటాం' అంటే నేను కసురుకునే వాడిని. 'అది పాత కాలం నాటి బొంత. డస్ట్ అలర్జీ వస్తుంది. ఈ బెడ్ మీదకు వచ్చేయండి' అని మందలించేవాడిని. అప్పుడు అమ్మ ''విశ్వం! చిన్నప్పుడు నిన్ను ఈ బొంత మీదనే పడుకోబెట్టేదాన్ని. ఎంత సుఖంగా నిద్రపోయే వాడివో! అని నవ్వేది.

నాకు ఆ బొంతంటే చికాకని అమ్మకు తెలుసు. అందుకే అప్పుడప్పుడు 'విశ్వం! నేను చనిపోతే నీవీ బొంతను ఏం చేస్తావో నాకు తెలుసు' అనేది. 'ఏం చేస్తాననుకుంటున్నావమ్మా!' అని అడిగితే 'తగలబెట్టడమో, దూరంగా పారేయడమో చేస్తావు. కానీ అలా చేయకురా! నా గుర్తుగా దాచుకో! ఒకవేళ ఇష్టం లేకపోతే భద్రంగా ఏ పెట్టెలోనో, బీరువాలోనో దాచేయి. అంతే గాని పారేయకు' అని జాలిగా ప్రాధేయపడేది. ఆ క్షణం నేను మౌనం వహించేవాడినే గాని 'అలాగేనమ్మా! అని మాత్రం మాట ఇచ్చేవాడిని కాదు.'

నా గుండె నిండా అమ్మ జ్ఞాపకాలు ఎన్నో ఉన్నాయి. అవి చెరిగేవి కావు. మరిక అమ్మ గుర్తుగా ఆ బొంత దాచుకోవడం ఎందుకు? తప్పక పారేయాలి అనుకునే వాడిని. నా ఆలోచనలు అర్థం చేసుకున్నట్లు అమ్మ చిన్నగా నవ్వేది.

ఒకసారి అమ్మకు సుస్తీ చేసింది. హాస్పిటల్లో జాయిన్ చేసాం. కాస్తంత స్పృహ రాగానే 'విశ్వం! ఈ మంచం ఒత్తుకుంటున్నదిరా! ఇంటికిపోయి నా బొంత పట్రా! అప్పుడే నాకు నిద్ర పడుతుంది' అని కోరింది.

అప్పటికప్పుడు ఇంటికిపోయి ఆ బొంతను తీసుకుని రిక్షాలో హాస్పిటల్‌కి బయలుదేరాను. నా ఒడిలో చేరిన ఆ బొంత ''నన్ను పారేయాలనుకున్నావు. అటువంటి నీవే నన్ను వెదుక్కుంటూ వచ్చి ఒడిలో పెట్టుకుని మరీ మోస్తున్నావు'' అని నవ్వినట్లు అనిపించింది.

అమ్మను హాస్పిటల్‌నుంచి డిశ్చార్జ్ చేసారు. అయినా అమ్మకు మునుపటి ఆరోగ్యం కరువయింది. నడవడానికి కూడా ఓపిక లేక నిస్సత్తువగా మంచంమీదే గడపసాగింది. ఆ అనారోగ్య పరిస్థితిలో అమ్మ తనకు ప్రాణప్రదమైన బొంత సంగతి కూడా మరిచిపోయింది.

అమ్మ ఎక్కడ దూరం అవుతుందో బాధతో నేనూ ఆ బొంత సంగతి మరచిపోయాను. అమ్మ ఒంటిమీద మెల్లమెల్లగా మృత్యుఛాయలు అలుముకోసాగాయి. ముఖం కళావిహీనమైంది. కళ్ళు నిర్జీవమయ్యాయి. అమ్మలో వస్తున్న మార్పులు నేను గమనిస్తూనే ఉన్నాను. నాలో దుఃఖం పెల్లుబుకసాగింది. వాడుతున్న మందులు అమ్మ ఆరోగ్యం మెరుగుపరచలేకపోయాయి. ఆఫీస్‌కు కూడా సెలవుపెట్టి అమ్మ ప్రక్కనే కూర్చుని సేవలు చేసుకుంటున్నాను.


అమ్మ నన్నెంతగా ప్రేమించేదో, నాకోసం ఎంత శ్రమించిందో, తపించిందో ఎరిగిన వాడిని కాబట్టి అమ్మను చూస్తుంటే హృదయం బాధతో మెలికలు తిరగసాగింది. అమ్మ లేని లోకాన్ని ఊహించుకోవాలంటే భయం వేయసాగింది. కళ్ళు మూసుకుని పడుకుని ఉన్న అమ్మను కన్నీరు నిండిన కళ్ళతో చూస్తూ మెల్లగా రోదించేవాడిని.

నా బాధ గమనించిన ఈశ్వరి మెల్లగా నన్ను ఓదార్చేది.

ఒక రోజు అమ్మ కళ్ళు తెరిచింది. నా బాధ అర్థం చేసుకుంది.

నా చేతిని తన చేతిలోకి తీసుకుని ''విశ్వం! నేను నీకు చాలా రుణపడి పోయాను'' అంది.

'అదేంమాటమ్మా!' అన్నాను. ''అవును బాబూ! ఈ



ఆరోజు అర్థరాత్రి మెలకువ వచ్చింది. అమ్మ వంక చూసాను. ప్రశాంతంగా నిద్రపోతున్నట్లు కనిపించింది. ఒక్క క్షణం పరిశీలనగా చూసాను. ఊపిరి పీలుస్తున్న కదలిక కనిపించలేదు. నా గుండె ఆగిపోయినట్లనిపించింది. ఈశ్వరిని తట్టి లేపాను. తను అమ్మ నాడి చూసి "అత్తయ్య మనకిక లేరండీ!"అని భోరున ఏడ్చింది.

రోజుల్లో తల్లిని ఎవరింతగా ప్రేమిస్తున్నారు? నన్ను ప్రాణప్రదంగా చూసుకున్నావు. నా ఆశీసులు నీకెప్పుడూ ఉంటాయి' అంటూ అమ్మ నన్ను దగ్గరకు తీసుకుని నుదుటి మీద ముద్దాడింది. నాకా క్షణం భూదేవి నన్ను అక్కున చేర్చుకుని ముద్దాడిన అనుభూతి కలిగింది. నాకు తెలీకుండానే కన్నీటి చుక్క రాలి అమ్మ మేను తాకింది.

నేను కూడా అమ్మ మంచం ప్రక్కనే మంచం వేసుకుని పడుకునేవాడిని. మధ్య మధ్యలో లేచి అమ్మచేత మంచి నీరు త్రాగించేవాడిని. అమ్మ నిద్రలో ఉంటే ఎక్కడ ఊపిరి ఆగిపోతుందోనని భయంభయంగా చూసేవాడిని.

ఆరోజు అర్ధరాత్రి మెలకువ వచ్చింది. అమ్మ వంక చూసాను. ప్రశాంతంగా నిద్రపోతున్నట్లు కనిపించింది. ఒక్క క్షణం పరిశీలనగా చూసాను. ఊపిరి పీలుస్తున్న కదలిక కనిపించలేదు. నా గుండె ఆగిపోయినట్లనిపించింది. ఈశ్వరిని తట్టి లేపాను. తను అమ్మ నాడి చూసి ''అత్తయ్య మనకిక లేరండీ!''అని భోరున ఏడ్చింది.

నేను అమ్మ శవం మీద కూలబడిపోయాను. కళ్ళ నుంచి కన్నీరు ధారాపాతంగా కారసాగింది. అమ్మ నామీద కురిపించిన ప్రేమ... చేసిన సేవలు... పడిన శ్రమలు... అన్నీ ఒకటొకటీ గుర్తుకొచ్చి నా ఆవేదనను మరింత అధికం చేసాయి.

ఈశ్వరి మెల్లగా తేరుకుని బంధువులు... స్నేహితులు... ఒకరొకరికీ ఫోన్‌లు చేసింది. అందరూ రాసాగారు. నన్ను ఓదార్చే ప్రయత్నం చేసారు. ఓదార్పులకు తగ్గే దుఃఖం కాదది. సముద్రం చెలియలికట్ట దాటినట్లుంది నా ఆవేదన.

మెల్లగా కర్మకాండ ముగిసింది. దిన కార్యం కూడా పూర్తయింది.

బంధువులందరూ వెళ్ళిపోయారు. అయినా నేను మనిషిని కాలేకపోయాను.

అమ్మ జ్ఞాపకాలు నన్ను పిచ్చివాణ్ని చేసాయి. నిద్ర కరువైంది. గెడ్డం మాసి... కళ్ళు లోతుకుపోయి... తిండి సరిగా తినక... నన్ను చూసి ఈశ్వరి, పిల్లలు భయపడ్డారు. ఈశ్వరి తన తల్లిదండ్రులను పిలిపించింది. వాళ్ళెంతగానో ధైర్యం చెప్పారు. ఓదార్చారు. అయినా నా దుఃఖం ఉపశమించలేదు.

హృదయానికైన గాయాన్ని మాన్పే శక్తి కాలానికే ఉందంటారు. ఆ కాలం కూడా నా గాయాన్ని పూర్తిగా మాయం చేయలేకపోయింది.

ఒకరోజు ఎందుకో బీరువా తెరిస్తే అందులో కనిపించింది అమ్మ వాడే అతుకుల బొంత. దాన్ని చూడగానే గతంలో ఎన్నోసార్లు ఆ బొంతను పారేయాలన్న ఆలోచన మదిలో మెదిలింది. అప్పుడు పారేయడానికి అమ్మ అడ్డు వచ్చేది. ఇప్పుడు ఎటువంటి అడ్డంకీ లేదు.

నాకెంతో అయిష్టమైన ఆ అతుకుల బొంతను పారేయడానికి చేతిలోకి తీసుకున్నాను. ఎందుకో తెలియదు. ఆ మెత్తని స్పర్శ అమ్మను జ్ఞప్తికి తెచ్చింది. హృదయంలోని దుఃఖం ఒక్కసారిగా బయటకు తన్నుకొచ్చింది. 'అమ్మా!'అంటూ ఆ అతుకుల బొంతను హృదయానికి హత్తుకుని వెక్కివెక్కి ఏడ్చాను.

అక్కడకు వచ్చిన ఈశ్వరి నన్ను ఓదార్చబోయింది. 'లీవ్‌మీ ఎలోన్!' అంటూ పెద్దగా అరిచాను. ఈశ్వరి మారుమాటాడకుండా వెళ్ళిపోయింది. అలా ఎంతసేపు ఏడ్చానో తెలియదు.

ఏడ్చి ఏడ్చి అలసిపోయాను. ఏం చేస్తున్నానో తెలియని స్థితిలో ఆ బొంతను నేలమీద పరచి దానిమీద పడుకున్నాను. అమ్మ ఒడిలో చేరిన అనుభూతి కలిగింది. నెల రోజుల నుంచి కరువైన నిద్ర మెల్లగా నన్ను కమ్మేసింది.

స్వప్నంలో అమ్మ సాక్షాత్కరించింది. నన్ను పలకరించింది. ప్రేమగా దగ్గరకు తీసుకుంది. ''విశ్వం! నీవిప్పుడు విశ్రమించింది అతుకుల బొంత మీద కాదు. నా ఒడిలో. అది నీకు సుఖంతోపాటు శాంతినిస్తుంది. వెచ్చదనంతోపాటు ఊరటనిస్తుంది. మరి దాన్ని పారేస్తావో, పదిలంగా దాచుకుంటావో! నీ ఇష్టం!'' అని మాయమైంది.

తెలతెలవారుతుండగా మెలకువ వచ్చింది. కళ్ళు తెరిచి చూసాను.

ఆ బొంత మీద నాకు అటూ, ఇటూ ఈశ్వరి, పిల్లలు పడుకుని ఉన్నారు. మెల్లగా లేచి కూర్చున్నాను. నీలం రంగు బొంత నీలాకాశంలా కనిపించింది. ఆ బొంతకున్న అతుకులు నక్షత్రాల్లా మెరిసాయి.

అమ్మ ఎక్కడికీ పోలేదు. నాతోనే ఉందనిపించింది. అంతేకాదు... అది అతుకుల బొంత కాదు. అమ్మ మాకోసం దాచి ఉంచిన హంస తూలికా తల్పం అనిపించింది. మనసులోని దుఃఖం మెల్లమెల్లగా మాయమై తెలియని నిశ్చింత చోటుచేసుకుంది. ఎందుకంటే అలసిసొలసిన వేళ సేద తీరడానికి అమ్మ ఒడిలాంటి ఆ అతుకుల బొంత ఉండనే ఉంది కదా!! ★